

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (ఆదివారం సాయంత్రం)	సెహరీ (సోమవారం ఉదయం)
కడప	6.31	5.07
ప్రొద్దుటూరు	6.32	5.11

గ్యాస్ నిక్షేపాల కోసం అన్వేషణ



బోరుబావులు తవ్వేందుకు తెలంగాణ నుంచి వచ్చిన ట్రాక్టర్ రిగ్గులు

- పులివెందుల-మైదుకూరు, ముదిగుబ్బ-కడప ప్రాంతాల్లో.. శాటిలైట్ ద్వారా గుర్తింపు
- ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో వేల సంఖ్యలో బోర్ల తవ్వకం

పులివెందుల, మార్చి15 (ఆంధ్రజ్యోతి): ఆయిల్, గ్యాస్ నిక్షేపాల కోసం ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో అన్వేషణ సాగుతోంది. కొన్ని రోజులుగా ట్రాక్టర్ రిగ్గుల ద్వారా బోర్లు తవ్వడం, అక్కడ వచ్చే శబ్దతరంగాలను రికార్డు చేసి ఢిల్లీకి పంపడం, తద్వారా అక్కడున్న పరిస్థితులను అంచనా వేసే సర్వే సాగుతోంది. రాయలసీమ జిల్లాల్లో ఈ అన్వేషణ ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం సాగిస్తోంది. అందులో భాగంగానే ప్రస్తుతం పులివెందుల ప్రాంతంలో వేల సంఖ్యలో బోర్లు తవ్వుతున్నారు. ఇదంతా ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో సాగుతోంది. వివరాలిలా..

ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల్లో భూమిలో ఆయిల్, గ్యాస్ నిక్షేపాలు ఏమైనా ఉన్నాయా అని అన్వేషణ సాగుతోంది. ఈ పనిని కేంద్ర ప్రభుత్వం ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్)కి అప్పగించింది. ఓఎన్‌జీసీ ప్రస్తుతం కడప, సత్యసాయి జిల్లాల్లో అన్వేషణ సాగిస్తోంది. అది కూడా పులివెందుల నుంచి మైదుకూరు వరకు ఒక ప్రాంతంగాను, ముదిగుబ్బ నుంచి కడప వరకు మరో ప్రాంతగాను తవ్వకాలు చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ఎక్కడెక్కడ బోర్లు వేయాలనేది శాటిలైట్ నుంచి వచ్చే లోకేషన్ ఆధారంగా నిర్ణయిస్తున్నారు.

100కు పైగా ట్రాక్టర్ రిగ్గులు

తెలంగాణ నుంచి వందకు పైగా ట్రాక్టర్ రిగ్గులు పులివెందుల ప్రాంతానికి వచ్చాయి. ఇవి ఒక్కొక్కటి 3.50 ఇంచుల వ్యాసార్ధంతో బోరు వేస్తాయి. అదికూడా 70 నుంచి 80అడుగుల లోతు మాత్రమే తవ్వుతారు. 80 అడుగుల లోతు తవ్వినపుడు అక్కడ శబ్దతరంగాల్లో తేడా వస్తే మరింత లోతు తవ్వే అవకాశం ఉంది. లేదంటే 70 నుంచి 80అడుగులు మాత్రమే తవ్వకాలు చేస్తారు. ఒక బోరు పాయింట్ నుంచి మరో బోరుపాయింట్‌కు 60 నుంచి 70మీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. శాటిలైట్ ఇచ్చే లోకేషన్‌లో మాత్రమే ఈ ట్రాక్టర్ రిగ్గులు బోర్లు వేస్తున్నాయి. అందులోను ఫైబర్ కేబుల్‌ను శాటిలైట్ చూపించిన సిగ్నల్ ఆధారంగా ఆయా ప్రాంతాల్లో పరిచారు. ఈ కేబుల్ మధ్యలోనే ఈ బోర్ల తవ్వకం సాగుతోంది. ప్రస్తుతం పులివెందుల, మైదుకూరు మధ్యలో ఈ బోర్ల తవ్వకం సాగుతోంది. అలాగే కడప నుంచి ముదిగుబ్బ వరకు మరో ఏరియాలో ఈ బోర్ల తవ్వకం సాగిస్తున్నామని ఓఎన్‌జీసీ ప్రతినిధి ఒకరు ఆంధ్రజ్యోతికి వివరించారు.

కాకినాడలో గ్యాస్ నిక్షేపాలు

ఈ అన్వేషణలో శబ్దతరంగాల ద్వారా సేకరించిన డేటాను ఢిల్లీకి పంపితే వాటిని విశ్లేషించి ఆయిల్, గ్యాస్ నిక్షేపాలు ఉన్నదీ లేనిది ఆరు నెలలకు వెల్లడించనున్నారు. అపుడు మరింత లోతుగా ఆయిల్, గ్యాస్ నిక్షేపాల కోసం ఇక్కడ పరిశోధనలు సాగనున్నాయి. గత ఏడాది తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో ఆయిల్, గ్యాస్ నిక్షేపాల కోసం అన్వేషణ సాగించినట్లు ఓఎన్‌జీసీ ప్రతినిధి వెల్లడించారు. కాకినాడ సమీపంలోని తాళ్లరేవు మండలం ప్రాంతంలో వివిధ గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్లు స్పష్టమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆ ప్రాంతం ఆధీనంలోకి తీసుకుని అభివృద్ధి చేయనుందన్నారు. పులివెందుల ప్రాంతంలో కొందరు రైతులు కొన్ని అపోహలకు గురై వారి పొలాల్లో బోర్లు తవ్వుతుంటే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కానీ కేవలం శాటిలైట్ ఇచ్చిన ఆధారంగా అక్కడ బోరు వేసి 24గంటల్లోనే ఆ బోరును పూడ్చివేసి వెళ్లిపోతామన్నారు. అంతేకాని అక్కడ ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించమన్నారు. ఎవరికీ నష్టం కలిగించమన్నారు. ఈ బోరు తవ్వకాలు పంటలు సాగులో ఉన్న పొలాల్లో గాని, బోరుబావుల వద్ద గాని వేయమన్నారు. పంట లేని పొలాల్లో, బీడు భూముల్లోనే ఈ తవ్వకాలు సాగిస్తున్నామన్నారు.



పంట పొలాల్లో పరిచిన ఫైబర్ కేబుల్

అరటి



తోటలో కాచిన అరటిగెల

- సగానికి తగ్గిన అరటి ధరలు
- రెండు నెలల్లోనే ధరలు పతనం

వేంపల్లె, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అరటి టన్ను రెండు నెలల క్రితం రూ.25వేల నుంచి రూ.28వేలు పలికింది. ప్రస్తుతం రూ.13వేల నుంచి రూ.15వేలకు పడిపోయింది. సగానికి సగం ధరలు తగ్గిపోవడం చూస్తుంటే వ్యాపారులు, దళారులు సిండికేట్‌గా మారారేమో అని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ ప్రాంతంలో టన్ను రూ.55వేలు అంటున్నారని ఇక్కడేమో రూ.15వేలు మించి ధర పలకడం లేదని వాపోతున్నారు.

22 వేల ఎకరాలకు పైగా సాగు

పులివెందుల నియోజకవర్గం జిల్లాలోనే అరటి పంటకు ప్రసిద్ధి. ఇక్కడ సుమారు 22వేల ఎకరాలకు పైగా అరటి సాగులో ఉంది. ఒక్క వేంపల్లె మండలంలోనే సుమారు 3,200ఎకరాల్లో అరటి సాగులో ఉంది. లింగాల మండలంలో పదివేల ఎకరాలకు పైగా సాగు చేశారు. ప్రస్తుతం అరటి దిగుబడి వస్తోంది. కానీ ధరలు పతనం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దళారులు, వ్యాపారులు కలిసి అరటి ధరను తగ్గిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక దృష్టిసారించి అరటికి తగిన ధర వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



అరటి గెలలను లారీలో లోడ్ చేస్తున్న దృశ్యం

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం : ఎస్పీ



మొక్క నాటుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యత అని, పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటూ దైనందిన విధులను మరింత సమర్థవంతంగా నిర్వర్తించవచ్చని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడో శనివారం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయం వద్ద స్టేడియం పరిసరాలను ఎస్పీ పాల్గొని పారలు, గునపం చేతబట్టి స్వయంగా శుభ్రపరిచారు. అనంతరం మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు క్రమశిక్షణతో ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా అందరికీ స్ఫూర్తి కలిగిస్తుందని, సమాజ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్‌ఐలు ఆనంద్, టైటస్, శివరాముడు, శ్రీశైలరెడ్డి, వీరేశ్ పాల్గొన్నారు.

నాణ్యత ఉన్న వస్తువులే కొనండి

- ప్రజలకు కలెక్టర్ సూచన

కడప కలెక్టరేట్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నాణ్యతగల వస్తువులనే కొనుగోలు చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రజలకు సూచించారు. వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శనివారం తన చాంబరులో కేంద్ర వినియోగదారులు, ఆహారం ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) బ్రోచర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఏదైనా వస్తువులను కొనుగోలు చేసే సమయంలో నాణ్యతకు సంబంధించి ఐఎస్ఐ, హాల్ మార్క్ ఉన్నవాటినే తీసుకోవాలన్నారు. ఇందుకోసం బీఐఎస్ కేర్ యాప్‌ను ఉపయోగించి ఏ వస్తువును ఎవరు ఉత్పత్తి చేశారు? తేదీ తదితర వివరాలను తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బీఐఎస్ ప్రతినిధులు సి.గంగయ్య, కొండా నరేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- డీఆర్వో విశ్వేశ్వరనాయుడు



ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణపై మాట్లాడుతున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప కలెక్టరేట్, మార్చి15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం, సోమవారం జరిగే ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, జూనియర్ అసిస్టెంట్ ఇన్ డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీకి సంబంధించిన పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయన మాట్లాడుతూ ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో జగిగే ఈ పరీక్షలకు జిల్లాలో 6 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. లైజాన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేసి పరీక్షలను సజావుగా, ఎలాంటి అక్రమాలకు తావులేకుండా జరిగేలా చూడాలన్నారు. అభ్యర్థులు, వారి వెంట వచ్చే వారికి ఎలాంటి కొరత లేకుండా ఆయా పరీక్షా కేంద్రాల యాజమాన్యాలు అన్ని వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీఎస్సీ పరీక్షల జిల్లా ప్రత్యేకాధికారులు ఎండీ బాబు, ఎ.శివనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల పర్యవేక్షణ తప్పనిసరి



వసతిగృహంలో భోజన పదార్థాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బోధన పరిశోధనల పరంగా బిజీగా ఉన్నప్పటికీ వసతిగృహాల పర్యవేక్షణకు తప్పనిసరిగా ప్రాధాన్యత ఇవ్వాలని వైవీయూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి అన్నారు. శనివారం విశ్వవిద్యాలయంలోని తన చాంబర్‌లో విశ్వవిద్యాలయ వసతి గృహ సంక్షేమ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతిగృహాల్లోని విద్యార్థుల కోసం ఆంగ్ల, తెలుగు దినపత్రికలు తెప్పించనున్నామన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి ఇవి ఉపయోగ పడతాయన్నారు. విద్యార్థినిల కోసం తైక్వాండో రెండో దశ శిక్షణ రెండు రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. డీఎస్సీ రాసే వారి సంఖ్యను బట్టి శిక్షణ ఇవ్వాలనే ఆలోచన చేస్తున్నామన్నారు. అనంతరం బాలికల వసతి గృహానికి వార్డెన్లతో పాటు వెళ్లి ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆహార పదార్థాలు ఎలా ఉన్నాయనే విషయంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో వసతిగృహ సంక్షేమ అధికారులు శ్రీనివాసుల రెడ్డి, రామ్‌మనోహర్‌రెడ్డి, వరప్రభాకర్, డి.ఆర్.సతీశ్‌బాబు, అనుప్రసన్న, మెర్సీ విజేత, ప్రజా సంబంధాల విభాగ సంచాలకులు పి.సరిత, టి.సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య సేవలకు ఆటంకం

- జిల్లాలో నిలిచిన సంచార వాహనాలు
- పాడి రైతుల అవస్థలు
- రోడ్డున పడ్డ సిబ్బంది



7



6

టీడీపీ నేత హత్య దారుణం

- పోలీసుల నిర్లక్ష్యమే ఈ హత్యకు కారణం
- ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ప్రొద్దుటూరులో భారీ చోరీ

- 25 తులాల ఆభరణాల అపహరణ





7

ముగిసిన ఇంటర్ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఈనెల 1 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమైన పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 64 కేంద్రాలు ఏర్పాటుచేశారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు 13న, రెండవ సంవత్సరం విద్యార్థులకు 15న పరీక్షలు ముగిశాయి. ఈనెల 7న జరిగిన రెండవ సంవత్సరం పరీక్షల్లో ఒక విద్యార్థి డీబార్ అయ్యాడు.

జడ్పీకి షాడో చైర్మన్





జిల్లా పరిషత్ కార్యాలయం

కడప రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు అధికారం కోల్పోయినా పదవులపై వ్యామోహం వీడలేదు. రాజ్యాంగ పదవులలో బలహీన వర్గాలు ఉన్నచోట కొందరు కర్రపెత్తనం చెలాయిస్తున్నారు. వైసీపీ సారధ్యంలోని జడ్పీ పాలక మండలి షాడో చైర్మన్ ఏలుబడిలో నడుస్తుండడమే ఇందుకు నిదర్శనం. ఓ వైసీపీ నేత జడ్పీకి షాడో చైర్మన్‌గా వ్యవహరిస్తూ జడ్పీ చైర్‌పర్సన్ అధికారాలను తన గుప్పెట్లో ఉంచుకుని తెరవెనుక పాలన సాగిస్తున్నారు.

జడ్పీ చైర్మన్‌గా ఉన్న ఆకేపాటి అమరనాథరెడ్డి 9 నెలల క్రితం రాజంపేట ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో ఆయన జడ్పీ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. తరువాత ప్రొద్దుటూరు జడ్పీటీసీ సభ్యురాలు జె.శారదను ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్‌గా నియమించారు. వెంటనే అదే నియోజకవర్గానికి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే అనుచరుడు (షాడో) జడ్పీ చైర్‌పర్సన్‌కు అధికారికంగా పర్సనల్ అబ్జర్వర్‌గా తనను నియమించాలని దరఖాస్తు చేసుకుని జడ్పీ ఉన్నతాధికారులపై వత్తిడి తీసుకొచ్చారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో అధికారులు ససేమిరా అన్నారు. చైర్మన్‌కు ఎవరినైనా పర్సనల్ అబ్జర్వర్‌గా నియమించాలంటే రాజకీయ పార్టీలకు చెంది ఉండకూడదని, పార్టీ సభ్యత్వం ఉండరాదని అన్నారు. దీంతో సదరు నేత షాడో చైర్మన్‌గా వ్యవహరిస్తూ తానే పెత్తనం చెలాయిస్తున్నారు. షాడో చైర్మన్ వస్తేనే చైర్‌పర్సన్ జడ్పీకి వస్తారనే ప్రచారం సాగుతోంది. షాడో చైర్మన్ ఆదేశాలతో ముఖ్యమైన ఫైళ్లన్నీ ప్రొద్దుటూరుకు తీసుకెళ్తున్నట్లు సమాచారం.

జిల్లా పరిషత్ పాలన మొత్తం పాలకమండలి నేతృత్వంలో కాకుండా షాడో చైర్మన్ నేతృత్వంలో నిర్వహిస్తుండడంతో పలువురు జడ్పీటీసీ సభ్యులు మండిపడుతున్నారు. పైగా అతను చైర్‌పర్సన్‌ను ఇతర పాలకమండలి జడ్పీటీసీలతో కలవడానికి వీలులేకుండా కట్టడి చేసినట్లు సమాచారం. సదరు జడ్పీటీసీలు షాడో చైర్మన్ వ్యవహార శైలిని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి, ఎంపీ అవినాశ్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. మరో ఏడాదిన్నర మాత్రమే పదవీకాలం ఉందని ఈ నేపథ్యంలో షాడో చైర్మన్‌తో ఇబ్బంది పడుతున్నామని వీరు ముఖ్యనేతలకు రెండు నెలల క్రితం గట్టిగా వినిపించినట్లు రాజకీయవర్గాల సమాచారం. కానీ ఇప్పటి వరకు ముఖ్యనేతల నుంచి ఎలాంటి దిద్దుబాటు చర్యలు లేకపోవడంతో ఇప్పటికీ జడ్పీ షాడో చైర్మన్ కనుసన్నల్లోనే కొనసాగుతోంది. వైసీపీకి చెందిన జడ్పీటీసీ సభ్యులు షాడో చైర్మన్ కారణంగా రోడ్డెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే వైసీపీకి చెందిన 47 మంది జడ్పీటీసీలలో ఆరుగురు టీడీపీ కూటమిలోకి వచ్చారు. ఈ నేపథ్యంలో మరికొందరు పార్టీ మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

భానుడు భగభగ

- 9 మండలాల్లో 40.4 నుంచి 41 డిగ్రీలు
- రేపు, మర్నాడు ఇదే పరిస్థితి

కడప కలెక్టరేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): భానుడి భగభగలతో జిల్లా ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రెండు రోజులుగా 39.40 డిగ్రీల ఉష్ణోగ్రతలు, వడగాల్పులతో జనం ఇబ్బంది పడగా.. శనివారం ఏకంగా 9 మండలాల్లో అత్యధికంగా 40.4 డిగ్రీల నుంచి 41 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. అందులో ఖాజీపేట, తొండూరు మండలాల్లో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటగా యర్రగుంట్ల మండలంలో 40.4, వేములలో 40.4, వేంపల్లిలో 40.7, సింహాద్రిపురంలో 40.6, ప్రొద్దుటూరులో 40.2, ముద్దనూరులో 40.4 చాపాడులో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా మండలాల్లో 37 డిగ్రీల నుంచి 39.8 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. కాగా ఆదివారం 18 మండలాల్లో 40 డిగ్రీల నుంచి 41.3 డిగ్రీల వరకు.. సోమవారం 29 మండలాల్లో 40.1 నుంచి 41.2 డీగ్రీల వరకు ఉష్ణోగ్రతలు ఉండనున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ఎండల వేడిమి నేపథ్యంలో జిల్లా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పారిశుధ్యం.. ప్రజలందరి బాధ్యత

● జిల్లా ప్రత్యేక అధికారి వాడరేవు వినయ్‌చంద్

రాయచోటిటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణ బాధ్యత మున్సిపల్ కార్మికులు, పంచాయతీ కార్మికులది మాత్రమే కాదని, ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ప్రత్యేక అధికారి వాడరేవు వినయ్‌చంద్ సూచించారు. శనివారం ఆయన పట్టణంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆలయ మండపంలో అర్చకులు తీర్థప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. అనంతరం ఆయన డైట్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇప్పటి నుంచే విద్యార్థులు పరిశుభ్రతను అలవాటుగా చేసుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆర్టీసీ బస్సు కూడలి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రారంభించిన ఈ కార్యక్రమం అన్ని ప్రాంతాల్లోనూ ప్రతి నెల మూడవ శనివారం ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పారిశుధ్య నిర్వహణ బాధ్యత మున్సిపల్ కార్మికులు, పంచాయతీ కార్మికులది మాత్రమే కాదని, ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, ఆలయ ఈవో విశ్వనాథ్, మున్సిపల్ అధికారులు, జిల్లా అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి వినయ్‌చంద్

మిద్దెపై నుంచి కింద పడి ఒకరి మృతి

రామాపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో మిద్దెపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి కథనం మేరకు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసికి చెందిన రాజేశ్ యాదవ్(40) మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొత్త రోడ్డు నారాయణపురం సమీపంలోని వినాయక స్టోన్ క్రషర్‌లో పనిచేస్తూ, కొత్తరోడ్డు నారాయణపురంలో నివాసముంటున్నాడు. హోలీ సందర్భంగా శుక్రవారం రాత్రి తన సహచరులతో కలిసి అతిగా మద్యం సేవించి, మిద్దెపై నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో మిద్దెపై నుంచి పడి మృతి చెందాడు. రామాపురం పోలీసులు. సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


రాజేశ్‌యాదవ్ మృతదేహం

పేకాట రాయుళ్ల అరెస్ట్.. నగదు స్వాధీనం

నిమ్మనపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆ డుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని, నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ ఐ తిప్పేస్వామి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని సామకోటవారిపల్లి పంచాయతీలోని ఓ చింతచెట్టు కింద అదే గ్రామానికి చెందిన నలుగురు పేకాట ఆడుతుండగా దాడులు నిర్వహించి రూ.3420 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


పోలీసులకు పట్టుబడ్డ పేకాట రాయుళ్లు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మదనపల్లె అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి):వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడి శనివారం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. కురబలకోట మండలం గొర్లవారిపల్లెకు చెందిన నాగమల్‌రెడ్డి (55), ఆదినారాయణ బైక్‌పై సీటీఎంకు వస్తుండగా మిట్టపల్లె వద్ద ఆటో ఢీ కొంది ఈ సంఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. మదనపల్లెలో టైలర్ షాపు నిర్వహిస్తున్న మధుకర్‌రెడ్డి (40) మధ్యాహ్నం ఇసుకనూతినపల్లె దారిలో వెళుతూ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో గాయపడిన అతనిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పాతకక్షలతో మహిళపై దాడి

గుర్రంకొండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పాతకక్షల కారణంగా దాడి చేసి గాయపరిచారంటూ ఓ మహిళ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సరిమడుగు పంచాయతీ కృష్ణాపురానికి చెందిన వాసాల రఘు, గంగరాణి దంపతులకు అదే గ్రామానికి చెందిన మల్లేశ్వరి కుటుంబానికి పాత కక్షలున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం మల్లేశ్వరి, ఆమె కుమారుడు సంతోష్ మరో పది మంది యువకులతో ఇంట్లోకి దూరి తనపై దాడి చేయడంతోపాటు ఇంట్లో ఉన్న టీవీ, ఫ్యాన్, బ్యాటరీ పంప్‌ను ధ్వంసం చేసి. చంపేస్తామంటూ బెదిరించినట్లు గంగరాణి ఫిర్యాదులో పేర్కొన్నారు.


గంగరాణి ఇంటిలో ధ్వంసమైన టీవీ, ఫ్యాన్ తదితరాలు

ఆత్మహత్య కేసులో ముగ్గురు అరెస్టు

మదనపల్లె అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దమ్మగారిపల్లెకు చెందిన గిరిబాబు గత నెల 20న ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు ఈ కేసులో నిందితులుగా భావిస్తున్న అదే గ్రామానికి చెందిన అనిల్, శివ, అరుణను శనివారం దేవతా నగర్ సమీపంలో శనివారం సాయంత్రం అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

ఆదర్శ ఉద్యోగులకు నగదు ప్రోత్సాహకాలు

మదనపల్లె అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి):మదనపల్లె ఆర్టీసీ వన్ డిపోలో శనివారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ డిపో పరిధిలో అత్యధికంగా కేఎంపీఎల్, ఈపీకే, అధికంగా ఆదాయం తెచ్చిన ఉద్యోగులకు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు రేవతి, రవి, తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో.. శ్రీవారి కల్యాణోత్సవం


కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు



రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి


వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు


శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు


గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు


చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు


సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు

టీడీపీ నేత హత్య దారుణం

● పోలీసుల నిర్లక్ష్యమే కారణం ● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

మదనపల్లె అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం, చంద్రమాకులపల్లె గ్రామం కృష్ణాపురానికి చెందిన టీడీపీ నేత రామకృష్ణ హత్య చాలా దారుణమని మాజీ మంత్రి, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఈ హత్య జరిగిందన్నారు.

చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం కృష్ణాపురంలో శనివారం ఉదయం చిల్లర అంగడి వద్ద కె.రామకృష్ణ కుమారుడు సురేశ్‌కుమార్ కూర్చుని ఉండగా.. అక్కడికి మాజీ వలంటీర్, వైసీపీ కార్యకర్త కె.వెంకటరమణ బైక్‌పై వచ్చి సంచిలో తెచ్చుకున్న కొడవలితో హత్య చేయడానికి ప్రయత్నించాడు. ఈ సంఘటనలో సురేశ్‌కుమార్ చేతికి గాయమైంది. అతను కేకలు వేస్తూ పరుగులు తీస్తుండగా అటుగా వెళుతున్న ద్విచక్రవాహనదారులు కాపాడారు. కొడుకును తరుముతున్నట్లు తెలుసుకున్న సురేశ్‌కుమార్ తండ్రి రామకృష్ణ పొలం దగ్గర నుంచి రాగా అతనిపై వెంకటరమణ కొడవలితో దాడిచేసి పారిపోయాడు. క్షతగాత్రులను వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ డాక్టర్లు సురేష్‌కుమార్‌కు చికిత్స చేశారు. రామకృష్ణను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతదేహాన్ని మదనపల్లె మార్చురీలో ఉంచారు.

మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రామకృష్ణ మృతదేహాన్ని అమరనాథరెడ్డి సందర్శించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కక్షపూరిత రాజకీయాల్లో భాగంగానే కృష్ణాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు వెంకటరమణ కొడవలితో దాడి చేసి రామకృష్ణ, అతని కుమారుడు సురేశ్‌ను గాయపర్చాడన్నారు. పోలీసుల నిర్లక్ష్యంతో ఈ రోజు నిండుప్రాణం పోయిందన్నారు. పోలీసు శాఖను ప్రభుత్వం ప్రక్షాళన చేయాలన్నారు. ఈయన వెంట పుంగనూరు ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ ఉన్నారు. సాయంత్రం పూతలపట్టు ఎమ్మెల్యే మురళి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి విచ్చేసి రామకృష్ణ మృతదేహాన్ని సందర్శించారు. కాగా.. మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో రామకృష్ణ మృతదేహాన్ని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, దొరస్వామినాయుడు సందర్శించారు. మృతుడి భార్య ఉమాదేవిని, కుమారులు సురేష్‌కుమార్, శివ కుటుంబసభ్యులను వారు పరామర్శించారు. హోం మంత్రితో బాధిత కుటుంబీకులను ఫోన్లో మాట్లాడించారు.

న్యాయం చేస్తామన్న హోంమంత్రి

గాయపడిన సురేశ్‌కుమార్ హోంమంత్రితో ఫోన్‌లో మాట్లాడుతూ గ్రామంలో మొదట వైసీపీని ఎదిరించి టీడీపీ జెండా కట్టింది మా నాన్న అని, గతంలో టీడీపీ గెలిచిన సందర్భంగా కేక్‌కట్ చేస్తుంటే బైక్‌పై వచ్చి మా అమ్మ రెండు కాళ్లు విరగగొట్టారని వివరించారు. తరువాత చంద్రబాబు నాయుడు బర్త్‌డే కార్యక్రమం చేస్తుంటే తన అన్న శివ చెయ్యి విరగ్గొట్టారని, ఇప్పుడు ఏకంగా కొడవలితో దాడి చేసి తన చేతికి గాయం చేశాడని, అడ్డు వచ్చిన మానాన్నను నరికి చంపేశాడని తెలిపారు. గతంలో జరిగిన సంఘటనలపై పుంగనూరు స్టేషన్‌లో కేసులు ఉన్నాయని, ఏ కేసులో కూడా తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడైనా న్యాయం చేయాలని వేడుకున్నారు. పార్టీ కోసం పాటుపడుతున్న వారికి న్యాయం చేయలేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. హోం మంత్రి వారిని పరామర్శించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు.


మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి


రామకృష్ణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు

ఊట చెరువు టీసీ సభ్యుల సస్పెన్షన్

సుండుపల్లె, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో గతంలో జరిగిన ఊట చెరువు ఎన్నికపై విచారణకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. సదరు ఘటనపై పూర్తి విచారణ చేసిన కమిటీ నాలుగు, ఐదో నంబర్ టీసీ ఎన్నికల్లో అక్రమాలు జరిగినట్లు నిర్ధారించింది. దీంతో ఆయా టీసీల బాధ్యులు అబ్దుల్ తవాబ్, ఖలీలుల్లాలను సస్పెండ్ చేస్తూ శనివారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టు ఉత్తర్వు ప్రకారం ఊట చెరువు అధ్యక్షుడిగా ఎన్నికైన లగిశెట్టి రామాంజులు టీసీ మూడుగా కొనసాగుతారని ఉత్తర్వుల్లో తెలియజేశారు. అప్రజాస్వామికంగా ఎన్నికైన టీసీ సభ్యులను సస్పెండ్ చేసినందుకు ఫిర్యాదుదారు టీసీ-2 సభ్యుడు మోహన్‌నాయుడు కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ చర్యతోకూటమి ప్రభుత్వంలో అక్రమాలకు చోటు ఉండదు అని నిరూపితమైందని, ఈ విషయంపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నారా లోకేశ్, ఇరిగేషన్‌శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇరిగేషన్ కమిషనర్ అన్నమయ్య జిల్లా కలెక్టర్, జిల్లా ఇరిగేషన్‌శాఖ అధికారులు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు.

మల్లూరమ్మ ఆలయ హుండీ లెక్కింపు

చిన్నమండెం, మార్చి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి పంచాయతీలో గురు, శుక్రవారాల్లో నిర్వహించిన మల్లూరమ్మ జాతర సందర్భంగా భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను శనివారం లెక్కించారు. దేవదాయశాఖ, పోలీసు, రెవెన్యూ సిబ్బందితోపాటు ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దాదాపు 2,93,890 రూపాయలు ఆదాయం వచ్చిందని ఈవో కొండారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.


హుండీలోని కానుకలు లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

పేదవాడి హాలీం.. గంజి!

» రమజాన్ మాసం ప్రత్యేకం

» ప్రతి మసీదులోనూ ఉచితంగా పంపిణీ ..

పీలేరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఇస్లాంలో రమజాన్ ప్రత్యేకమైనది. ఈ నెలలో చేసే ప్రార్థనలు, నమాజులు, దానధర్మాలకు ఎంతో ప్రత్యేకత ఉంటుంది. ధార్మికమైన అంశాలలోనే కాకుండా ఆహార అలవాట్లలో కూడా రమజాన్ మాసం ప్రత్యేకత చాటుకుంటుంది. రోజంతా కఠోర ఉపవాసం ఉండే ముస్లింలు సాయంత్రం ఇఫ్తార్ సమయంలో బలవర్ధకమైన భోజనం కావాలని కోరుకుంటారు. ఖర్జూరంతోపాటు, పలు రకాల ఫలాలు తీసుకుంటూ ఉంటారు. వీటితోపాటు తెలంగాణ ప్రాంతంలో హలీమ్, కోసాంధ్ర ప్రాంతంలో గంజి ఎక్కువగా స్వీకరిస్తారు. హలీమ్ మాంసాహారం కావడంతో దాని తయారీం, వినియోగం అందరికీ సాధ్యపడదు. ఇక గంజి .. తక్కువ ఖర్చుతో, సులువుగా తయారు చేసుకునే అవకాశం ఉండడంతో, అందరూ దీని వైపు మళ్లుతున్నారు. రెండు దశాబ్దాల క్రితం గృహస్థులు గంజిని తయారు చేసి మసీదుకు వితరణ చేసేవారు. కాలక్రమంలో మసీదు కమిటీ సభ్యులే దానిని తయారు చేసి తమ మసీదు పరిధిలోని వారికి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

తయారీ ఇలా..

బియ్యం రవ్వ లేదా, బొంబాయి రవ్వతో గంజిని తయారు చేస్తున్నారు. పీలేరు ప్రాంతంలోని అత్యధిక మసీదుల్లో బొంబాయి రవ్వతో తయారు చేసిన గంజిని పంపిణీ చేస్తున్నారు. బొంబాయి రవ్వ, పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లి, టమోటాలు, కొత్తిమీర, పుదీనా, యాలకులు, దాల్చిన చెక్క, లవంగాలు, నెయ్యి, కొన్ని చోట్ల వేరుశెనగ గింజలను వాడుతుంటారు. రమజాన్ మాసం ప్రారంభమైన నాటి నుంచి మసీదు కమిటీ సభ్యులు గంజి తయారీకి ఎటువంటి ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇలా తయారు చేసిన గంజిని కుల, మతాలకు అతీతంగా ఇష్టపడుతుంటారు. క్యూలలో నిలబడి మరీ ఇళ్లకు తీసుకెళుతుంటారు.


గంజి పంపిణీ చేస్తున్న మసీదు కమిటీ సభ్యులు

రమజాన్ మాసంలో అతి ముఖ్యమైన ఆరాధన ఉపవాసం. రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాల్లో గంజిని ఆహారంగా తీసుకుని ఉపవాసం విరమిస్తుంటారు. చాలా ప్రాంతాల్లో ఇఫ్తార్ సమయంలో పండ్లు, అల్పాహారం లేకపోయినా చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరూ ఒక గిన్నె గంజి తప్పకుండా తాగుతారు.

ఆరోగ్య ప్రయోజనాలు

- ఉపవాసం కారణంగా సుమారు 14 గంటలు ఆహారానికి దూరంగా ఉన్న శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది.
- వేడెక్కిన శరీరాన్ని చల్లబరుస్తుంది.
- గంజిలో విటమిన్లు, ఖనిజాలు, యాంటి ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన పోషకాలు అందిస్తాయి.
- ఫైబర్ అధికంగా ఉన్న కారణంగా జీర్ణక్రియ మెరుగుపడుతుంది.
- కేలరీలు తక్కువగా ఉంటాయి కాబట్టి బరువు తగ్గించడంలో సహాయపడుతుంది.
- కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను క్రమంగా పెంచుతుంది.


పీలేరు అక్సా మసీదులో గంజి తయారీ కోసం కూరగాయలు కోస్తున్న కమిటీ సభ్యులు

ఏప్రిల్‌లో రెండో దశ పశువైద్య శిబిరాలు

● పశుసంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై

తంబళ్లపల్లె, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వేసవిలో పశువులు జబ్బుల బారిన పడకుండా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు గుణశేఖర్ పిళ్లై సూచించారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం సందర్భంగా మండలానికి వచ్చిన ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జాతీయ పశువ్యాధి నివారణ పథకం కింద మార్చి 31 వరకు జిల్లా వ్యాప్తంగా సుమారు 3,33,300 గాలి కుంటు టీకాలను వేయనున్నట్లు తెలిపారు. ప్రతి మండలంలో పశువైద్య సిబ్బంది బృందాలుగా ఏర్పడి ఉదయమే ఇంటింటికీ వెళ్లి మూడు నెలలు వయసు పైబడ్డ పశువులన్నింటికీ ఉచితంగా టీకాలు వేస్తారన్నారు. గాలికుంటు టీకా పంపిణీలో రాష్ట్రంలో అన్నమయ్య జిల్లా ద్వితీయ స్థానంలో ఉన్నట్లు వివరించారు. పెయ్యదూడలకు బ్రుసెల్లోసిస్ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ టీకాలు జిల్లాకు 15,000 డోసులు వచ్చాయని.. 4 నుంచి 8 మాసాలలోపు పెయ్య దూడలకు వీటిని వేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి దాకా జిల్లాలో 10వేల టీకాలను వేశామని, ఈ నెల చివరకు మిగిలిన టీకాలు పూర్తి చేస్తామని తెలిపారు. వేసవిలో పశుగ్రాస కొరతను అధిగమించేందుకు గత 2024-25లో నీటి ఎద్దడి తట్టుకుని అధిక గ్రాసాన్నిచ్చే 175 టన్నుల గడ్డి విత్తనాలను 75 శాతం రాయితీతో పంపిణీ చేసినట్లు తెలిపారు. సాగు నీటి సౌకర్యం ఉన్న రైతులు ఈ విత్తనాలు పొంది పశుగ్రాసాన్ని నిల్వ చేసుకున్నట్లు వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కో రైతు 10 సెంట్ల నుంచి 50 సెంట్లలో బహువార్షిక గడ్డి పెంపకానికి వంద శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో దాదాపు 500 ఎకరాలలో గడ్డి సాగుకు ప్రోత్సహించినట్లు తెలిపారు. జనవరిలో నిర్వహించిన పశువైద్య శిబిరాలలో కొన్ని లక్షల పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ శిబిరాలకు పాడి రైతుల నుంచి విశేష స్పందన రావడంతో ఏప్రిల్‌లో రెండో విడత నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, ఎంఈవో త్యాగరాజు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న జేడీఏహెచ్ గుణశేఖర్ పిళ్లై

పశువైద్య సేవలకు ఆటంకం

● జిల్లాలో నిలిచిన సంచార వాహనాలు ● పాడి రైతుల అవస్థలు ● రోడ్డున పడ్డ సిబ్బంది

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పశువులకు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు గత ప్రభుత్వం సంచార పశు ఆరోగ్య సేవా వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. పశువులకు ప్రమాదాలు జరిగినప్పుడు, రోగాల బారిన పడినప్పుడు దూర ప్రాంతాల్లోని వైద్యశాలలకు తీసుకెళ్లాలంటే పోషకులు వ్యయప్రయాసలు పడేవారు. ఒక్కోసారి లక్షలు విలువచేసే పశువులు మృత్యువాత పడుతుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో మూగజీవాల మరణాల రేటును తగ్గించేందుకు సంచార వాహనాలను ఏర్పాటు చేశారు. 2022 మే నెలలో తొలివిడత ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున జిల్లాకు ఏడు వాహనాలు కేటాయించారు. ప్రస్తుతం జీవీకే సంస్థతో ఒప్పందం ముగిసిపోవడంతో వాటి సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. మొదటి విడతలో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కమలాపురం, మైదుకూరు, కడప, బద్వేలు, పులివెందుల నియోజకవర్గ ప్రాంతాల్లో వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. దీంతో గ్రామాల్లోని పశుపోషకులు జీవాలకు ఏవైనా వ్యాధులు సోకితే చికిత్సలు చేయించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

పాడి రైతుల అవస్థలు

20వ పశుగణన సర్వే ప్రకారం జిల్లాలో గేదెలు 3,99,754, ఎద్దులు, ఆవులు 44 వేలు, గొర్రెలు 9,20,614, మేకలు 3,80,099 ఉండగా.. జిల్లాలో 1.80 లక్షల మంది ప్రత్యక్ష పాడి రైతులు ఉన్నారు. ఈ నేపథ్యంలో పశువుల సంరక్షణ కోసం 20 రకాల మల సంబంధిత పరీక్షలు, 15 రకాల రక్త పరీక్షలు చేసే వీలుగా మైక్రోస్కోప్‌తోపాటు ఆటోగ్లేవ్ ప్రయోగశాలను సంచార వాహనంలో ఏర్పాటు చేశారు. హైడ్రాలిక్ సౌకర్యంతో పశువులను వెంటనే వాహనంలోకి ఎక్కించి చికిత్స అందించేందుకు వీలుండేది. ఇంకా అత్యవసర పరిస్థితి అయితే అందులోనే వైద్యశాలలకు తరలించి చికిత్స అందించేవారు. వాహనంలో పశువైద్యుడితోపాటు పారావేట్, డ్రైవర్‌కం అటెండర్ ఉండేవారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు తీవ్ర అనారోగ్యానికి గురైనప్పుడు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు పశుపోషకులు టోల్‌ఫ్రీ నెంబరు 1962కు ఫోన్‌చేస్తే ఆయా గ్రామాలకు వెళ్లి వైద్యసేవలు అందించే వారు. అత్యవసర వైద్యం చేయాల్సివస్తే వైద్య నిపుణులు స్థానిక సిబ్బందితో కలిసి వాహనంతో ఘటనా స్థలానికి చేరుకుని శస్త్ర చికిత్సలు చేసేవారు. వాహనాలు ఆగిపోవడంతో పశువులకు ఏవైనా అత్యవసర వైద్యం చేయాల్సి వస్తే ఇబ్బందిగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గడువు ముగియడంతో నిలిచిపోయాయి..

తొలి విడత వాహనాలు ఒప్పందం ముగియడంతో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో వాహనాలు నిలిచిపోయాయి. రెండవ విడత వచ్చిన వాహనాలతో వైద్య సేవలు అందిస్తున్నాం. పశు వైద్య సేవలకు ఆటంకం లేకుండా చూస్తున్నాం.

- సి.శారదమ్మ, పశుసంవర్ధకశాఖ జేడీ



నిలిచిన సంచార పశుఆరోగ్య సేవా వాహనం

ఫిబ్రవరి 15 నుంచి..

జీవీకే సంస్థతో ఒప్పందం ముగియడంతో మొదటి విడతలో జిల్లాకు కేటాయించిన వాహనాలు ఫిబ్రవరి 15 నుంచి ఆగిపోయాయి. ఇందులో పనిచేసే సిబ్బంది ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడ్డారు. వీరంతా తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ శారదమ్మను కలిసి సిబ్బంది వినతి పత్రం అందించారు. ప్రభుత్వం ఏ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నా తమను తిరిగి విధుల్లో కొనసాగించాలని కోరుతున్నారు.


పశుసంవర్ధకశాఖ జేడీ శారదమ్మకు వినతి పత్రం అందిస్తున్న సంచార వాహన సిబ్బంది

విద్యార్థిని ఆత్మహత్య కారకులపై కేసు నమోదు చేయాలి

● ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్


డీడీ సరస్వతికి వినతిపత్రం అందిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, విద్యార్థి సంఘాల నేతలు

జమ్మలమడుగు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహ విద్యార్థిని అక్షయ ఆత్మహత్యకు కారకులైనవారిపై కేసు నమోదు చేయాలని ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద విద్యార్థిని మృతదేహాన్ని సోషియల్ వెల్ఫేర్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి సందర్శించారు. అలాగే టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, జనసేన నాయకుడు సింగరెడ్డి నాగేశ్వరరెడ్డితో పాటు సీపీఐ ప్రసాద్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, శిరివెళ్ల లక్ష్మీనారాయణ, సీపీఎం శివనారాయణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బత్తల పీటర్, అరవింద్, టీఎన్ఎస్ఎఫ్, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు బొర్రా రామాంజనేయులు, బీజేపీ కొండయ్య, చేనేత ఐక్యవేదిక జాతీయ ఉపాధ్యక్షులు కాటా రామరాసు, సురేష్, నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు మృతదేహాన్ని సందర్శించి మృతురాలి తల్లి పద్మావతితో మాట్లాడారు. తల్లికి పింఛన్‌తో పాటు ఆమె కుమారుడికి ఉద్యోగం, ప్రభుత్వపరంగా ఆర్థికసాయం అందేలా చేస్తామని భూపేశ్‌రెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీడీ సరస్వతికి వినతి పత్రం అందించారు. విద్యార్థిని ఆత్మహత్యకు కారకులైనవారిపై విచారణ జరిపిస్తున్నామని, ముందుగా వార్డెన్ బత్తల ప్రభావతిని సస్పెండ్ చేశామని, అలాగే మరో ఇద్దరు సిబ్బందిని విధుల నుంచి పూర్తిగా తొలగించేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపామని డీడీ సరస్వతి తెలిపారు. ఏఎస్‌డబ్ల్యూవో గురుప్రసాద్‌పై క్రమశిక్షణ చర్యలతో పాటు అతని నిర్లక్ష్యానికి సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు తెలిపారు. ఆ వసతి గృహంలో అనేక ఆరోపణలు ఉన్నాయని, ఇంకా విచారణ జరుగుతోందన్నారు. వసతి గృహాల్లో ఇలాంటివి పునరావృ తం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

శిలాఫలకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి



బస్‌షెల్టర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చే ప్రజలు, రోగులు బస్‌షెల్టర్లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం కడపరోడ్డులోని సర్వజన ఆసుపత్రి వద్ద నూతనంగా నిర్మించిన బస్సుషెల్టరును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడా సాగు, తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. చక్రాయపేట మండలంలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉందని కలెక్టరు దృష్టికి తీసుకెళ్లడంతో ప్రస్తుతానికి బోర్లు వేయడం జరిగిందని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మరిన్ని నిధులు మంజూరు చేయించడానికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డిని 60వేల మెజార్టీతో గెలిపిస్తే సమస్యలను గాలికి వదిలేశారన్నారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్‌అండ్‌బీ ఈఈ మాధవి, డీఈ జగదీశ్వర్‌రెడ్డి, మోపూరి దేవాలయం ఛైర్మన్ వెంకటరమణారెడ్డి, తొండూరు మాజీ మండల అధ్యక్షుడు ఎం.రమణారెడ్డి, కడప పార్లమెంటు కార్యదర్శి బొజ్జ మైసూరారెడ్డి, బీజేపీ నాయకుడు భానుప్రకాశ్, ఆర్‌అండ్‌బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వివాదరహితంగా పాఠశాలల విలీన ప్రక్రియ

● ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వివాదరహితంగా పాఠశాలల విలీన ప్రక్రియ చేపడతామని పశ్చిమ రాయలసీమ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అన్నారు. పులివెందుల ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శనివారం జిల్లా విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో ఏడు మండలాల విద్యాశాఖాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా తల్లిదండ్రుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ముందుకు సాగుతామని, అవసరమైతే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి సానుకూల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. డ్రాపవుట్స్ నివారణే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామన్నారు. కొత్త విధానంలో శాటిలైట్ ఫౌండేషనల్ స్కూలు, బేసిక్ ప్రైమరీ స్కూలు, మోడల్ ప్రైమరీ స్కూలు తదితర ఐదురకాల పాఠశాలలు ఏర్పాటు చేయడంపై అధికారులతో చర్చించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

పంటకుంటలను సద్వినియోగం చేసుకోవాలి

సీకేదిన్నె, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట కుంటలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ శివప్రసాద్ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలంలో జరుగుతున్న పంట కుంటలు, పండ్ల తోటల పెంపకం పనులను శనివారం ఆయన పరిశీలించారు. చింతకొమ్మదిన్నె, అశ్వత్థగారిపల్లెల్లో రైతులు నిర్మించుకుంటున్న పంట కుంటలను పరిశీలించి సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కుంటలు రైతులకు ఎంతో మేలు అని, ఇందులో నీరు పంటలకు చక్కగా ఉపయోగించుకోవచ్చన్నారు. కుంట సమీపంలో వివిధ రకాల మొక్కలు పెంచుకుని రైతులు అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. రైతుకు ఎటువంటి ఖర్చు లేకుండా ఉపాధి హామీ ద్వారా ఈ పంట కుంటలు నిర్మించుకోవచ్చని తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం ఆరు గంటలకే పనులకు వచ్చి కొలతల ప్రకారం పనులు చేసుకోవాలన్నారు. మండలంలో 33 పంట కుంటలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఖాజాయిబాబు, ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఏపీవో రామాంజనేయులరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి రూ.90లక్షల ఆదాయం

పులివెందుల టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పురపాలక సంఘానికి సంబంధించి 2025-26 సంవత్సరానికి బహిరంగ వేలం ద్వారా రూ.90,11,000 ఆదాయం వచ్చిందని మున్సిపల్ కమిషనరు రాముడు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం దిన, వారపు సంత మార్కెట్‌లో వాహనాల ఫీజులు, జంతు వధశాలకు బహిరంగ వేలంపాట నిర్వహించారు. దిన, వారపు సంత మార్కెట్‌ను సి.శ్రీనివాసరెడ్డి రూ.51,35,000లకు, నిలుపబడిన వాహనాల ఫీజు వసూలును ఈ.పద్మావతి రూ.34,35,000లకు, అలాగే జంతు వధశాలను సుశీలమ్మ రూ.4,41,000లతో దక్కించుకున్నారు. దీంతో గత సంవత్సరం కంటే రూ.12,77,000 అధికంగా పురపాలక సంఘానికి ఆదాయం వచ్చిందని కమిషనరు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ సిబ్బంది, వేలంపాటదారులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో భారీ చోరీ

● 25 తులాల బంగారు ఆభరణాల అపహరణ


చోరీపై వివరాలు తెలుసుకుంటున్న సీఐ యుగంధర్

ప్రొద్దుటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు టూటౌన్ పోలీసుస్టేషను పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఇంట్లోవారు నిద్రలో ఉండగా దొంగలు దర్జాగా ఇంట్లోకి వచ్చి బీరువా తాళాలు తీసి 25 తులాల బంగారు ఆభరణాలు దోపిడీ చేశారు. ఆ వివరాల్లోకి వెళితే.. రాజుపాళెం మండలం టంగుటూరు గ్రామానికి చెందిన గోపిరెడ్డి శివశంకర్‌రెడ్డి తన కుమార్తె చదువుల కోసం ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసముంటున్నాడు. శనివారం రాత్రి భోజనాల తర్వాత భార్య, కూతురుతో పాటు శివశంకర్‌రెడ్డి మేడపైన బెడ్ రూములో నిద్రపోయారు. కింద ఫ్లోర్‌లో రెండు బెడ్ రూములు, మేడమీద రెండు బెడ్ రూములున్నాయి. ఒక బెడ్ రూములో తామంతా పడుకుని ఉండగా మరో బెడ్ రూముకు కేవలం గడియ పెట్టారు. తెల్లవారుజామున దొంగలు కింద ఫ్లోర్‌లోనుంచి కిచెన్ రూము తలుపులు తీసి ఇంట్లోకి చొరబడి నేరుగా పైఫ్లోర్‌కు వచ్చారు. నిద్రిస్తున్న వారు బయటికి రాకుండా ఆ గదికి దొంగలు తాళం వేశారు. మరో బెడ్ రూములో ఉన్న బీరువా తాళాలు తీసి 25 తులాల బంగారు ఆభరణాలు దొంగలించారు. తెల్లవారి 5గంటలకు నిద్రలేచిన శివశంకర్‌రెడ్డి బయటికి రావడానికి ప్రయత్నించగా తలుపులకు గడియ వేసివున్నట్లు గుర్తించారు. పక్కన ఉన్న బంధువులకు ఫోన్ చేయగా వారొచ్చి గడియ తీశారు. అప్పుడు ఇంట్లో దొంగలు పడ్డారని గ్రహించి, బీరువాలో బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయని గుర్తించి వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. టూటౌన్ సీఐ యుగంధర్, ఎస్ఐ ఇంటిని పరిశీలించి క్లూస్‌టీములతో వేలిముద్రల సేకరించారు. అలాగే పోలీసు జాగిలంతో పరిశీలించగా అది హౌసింగ్ బోర్డు నుంచి మదూరు రోడ్డు వరకు వచ్చి ఆగిపోయింది. దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక టీములతో గాలింపు మొదలుపెట్టారు. చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కాగా వారం కిందటే రూరల్ పోలీసుస్టేషను పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ గెటెడ్ కమ్యూనిటీకి చెందిన లక్ష్మీనగర్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి భారీ దోపిడీకి పాల్పడ్డారు. దాదాపు 85 తులాల బంగారంతో పాటు 7లక్షల నగదు అపహరించుకుపోయారు. ఈ వరుస దొంగతనాలు ప్రొద్దుటూరు పోలీసులకు పెద్ద సవాల్‌గా మారాయి.

మహిళపై దాడి కేసును ఛేదించిన పోలీసులు

● నిందితుడి అరెస్టు.. రిమాండుకు తరలింపు


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

కమలాపురం రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఇంట్లోకి చొరబడి ఒంటరిగా ఉన్న మహిళ కంట్లో కారంపొడి కత్తితో దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు తరలించామని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం సాయంత్రం కమలాపురం పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 13న కమలాపురం గిడ్డంగివీధిలో లక్ష్మీదేవి అనే మహిళపై కత్తితో దాడి చేసి బంగారు నగలు అపహరించుకుపోయిన ఆకుల నవీన్ వల్లూరు మండలం తోళ్లగంగనపల్లె క్రాస్ వద్ద ఉండగా సీఐ రోషన్, సీసీఎస్ సీఐ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి అరెస్టు చేశారని, అతని వద్ద నుంచి బంగారు నగలు, దాడికి ఉపయోగించిన ఆయుధం స్వాధీనం చేసుకున్నామన్నారు. నవీన్ ఇంటర్ వరకు చదివి క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌కు బానిస అయ్యాడని, ఫిర్యాదుదారి లక్ష్మీదేవి వద్ద రూ.30 వేలకు తన సెల్‌ఫోన్ తాకట్టు పెట్టాడని, ఆ అప్పు తీర్చలేక ఆమెను చంపాలని కత్తితో దాడి చేసి బంగారు నగలు దోచుకెళ్లాడన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటరమణ, హెడ్‌కానిస్టేబుల్ కొండారెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నాలుగు లక్షల మంది వలంటీర్లను తీసుకుని రూ.5 వేలు వేతనం చెల్లించిందన్నారు. వలంటీర్లను కొనసాగిస్తామని, నెలకు రూ.10 వేలు వేతనం చెల్లిస్తామని ఎన్నికల్లో టీడీపీ అధినేత బహిరంగ సభల్లో హామీ ఇచ్చారన్నారు. 9 నెలలుగా ప్రభుత్వం వలంటీర్లకు వేతనాలు చెల్లించడంలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లను విధుల్లోకి తీసుకుని వేతన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 17వ తేదీ విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నామని, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, ఆటోయూనియన్ కార్యదర్శి శ్రీను, లక్షుమయ్య, పాల్గొన్నారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సుధీర్

బద్వేలుటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాతీయ రహదారి మైదుకూరురోడ్డులోని టీటీడీ కళ్యాణమండపం సమీపంలో కారు, ద్విచక్రవాహనం ఢీకొని తుంగ సుధీర్(35) మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. వెంకటయ్యనగర్‌కు చెందిన తుంగ సుధీర్(35) జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లి ఇటీవల ఇంటికి వచ్చాడు. ఇంటి వద్ద కూడా జీవనోపాధి కోసం డ్రైవర్‌గా వెళుతుండేవాడు. శనివారం రాత్రి ఓ వివాహవేడుకకు వెళ్లి తిరిగి ద్విచక్రవాహనంలో ఇంటికి వస్తుండగా, కొన్ని క్షణాల్లో ఇంటికి చేరుతాడన్న సమయంలో నెల్లూరు నుంచి మైదుకూరు వైపు వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో సుధీర్ కిందపడ్డాడు. గమ నించిన స్థానికులు, బంధువులు 108వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారణ చేశారు. మృతుడికి భార్య ప్రమీళ, కుమారుడు భార్గవ్, కుమార్తె తరుణి కలరు.

పరిశుభ్రత కోసం సమయం కేటాయించాలి : డీపీఆర్‌సీ ఏవో

కడప రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం (డీపీఆర్‌సీ)లో పనిచేసే ప్రతి అధికారి, ఉద్యోగి, సిబ్బంది పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతిరోజూ కొంత సమయం కేటాయించాలని డీపీఆర్‌సీ ఏవో బండపల్లి నాగభూషణం పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డీపీఆర్‌సీ ప్రిన్సిపల్(జడ్పీసీఈవో) ఓబులమ్మ, వైస్ ప్రిన్సిపల్ (డీపీవో) రాజ్యలక్ష్మి నేతృత్వంలో శనివారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీలో పరిసరాలను పరిశుభ్రం చేసి స్వచ్ఛఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే స్వచ్ఛత కార్యక్రమాల కోసం శ్రమదానం చేసి పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అలాగే తోటివారికి కూడా స్వచ్ఛత కోసం తడిచెత్త, పొడిచెత్తను వేరు చేయటంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ ట్రైనింగ్ మేనేజర్ ఏవీ సురేశ్‌కుమార్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఆర్ ఏఎస్ఐ సస్పెన్షన్

కడపక్రైం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఏఆర్ ఏఎస్ఐగా పని చేస్తున్న రమణారెడ్డిని సస్పెండ్ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏఎస్ఐ రమణారెడ్డి ఉద్యోగాల పేరుతో పలువురి నుంచి డబ్బులు వసూలు చేశాడన్న ఆరోపణలు ఉన్నాయి. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితుల ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ చేపట్టారు. ఏఎస్ఐపై ఆరోపణలు నిజం కావడంతో సస్పెండ్ చేశారు.

గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్న వాహనాలు సీజ్

కడప కలెక్టరేట్ మార్చి15(ఆంధ్రజ్యోతి) నగర శివారు చిన్నచౌకు గ్రామ పొలంలో సర్వే నెంబరు 919లో నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న 2 టిప్పర్లు, 1 ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు శనివారం సీజ్ చేశారు. ఆ వాహనాలను తహశీల్దారు కార్యాలయానికి తరలించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్, వీఆర్వోలు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, పాల్గొన్నారు.

ప్రజాధనం.. వీధిపాలు

పులివెందుల చుట్టూ ఉన్న రింగురోడ్లకు సుందరీకరణ పేరుతో రూ.కోట్లు ఖర్చు చేశారు. వాకింగ్ ట్రాక్, డివైడర్ మధ్యలో గ్రీనరీ పెంచడం, లైటింగ్ సిస్టం.. ఎన్నో పనులు చేశారు. అవి ఏవీ ఉపయోగంలో లేకపోవడంతో అలాగే వదిలేశారు. దీంతో రూ.కోట్ల ప్రజాధనం నిరుపయోగమైందని పలువురు విమర్శిస్తున్నారు.



ముద్దనూరు సర్కిల్‌లో వైఎస్ విగ్రహం వద్ద ఎండుతున్న అందమైన మొక్కలు

● ఒకవైపు వెలగని వీధి దీపాలు.. మరోవైపు ఎండుతున్న గ్రీనరీ ● ఇదీ పులివెందుల రింగురోడ్ల దుస్థితి

పులివెందుల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పులివెందుల చుట్టూ ఉన్న రింగురోడ్ల సుందరీకరణ పనుల కోసం రూ.40.32కోట్లు వెచ్చించారు. ఇందులో రోడ్డు వేయడం, రోడ్డుకు రెండువైపులా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం, మధ్యలో డివైడర్ ఏర్పాటుచేసి అందులో గ్రీనరీ పెంచడం తదితర పనులకు ఈ నిధులు మంజూరు చేశారు. గ్రీనరీ కోసం రూ.3.50కోట్లు, లైటింగ్ సిస్టం (వీధి దీపాలకు, ఆయిదు సర్కిళ్లలో హైమాస్ట్ లైట్లు)కు రూ.2.70కోట్లు ఖర్చు చేశారు. ఈ పనులు పూర్తయినా వాటిని ఉపయోగించుకోవడంలో అటు మున్సిపాలిటీ, ఇటు ఆర్అండ్‌బీ చేతులెత్తేసింది. ఆర్అండ్‌బీ అధికారులు ఈ పనులు పూర్తిచేసి మున్సిపాలిటీకి అప్పగించాల్సి ఉంది. ఈ పనులు పూర్తిచేసి మున్సిపాలిటీకి ఇచ్చేందుకు ఆర్అండ్‌బీ సిద్ధమైనా మున్సిపాలిటీ అధికారులు పలు కారణాలు చెప్పి తప్పించుకుంటున్నారు. దీంతో వీధిలైట్లు, హైమాస్ట్ లైట్లను వెలిగించలేదు. అలాగే గ్రీనరీ కోసం ఖర్చుచేసిన కోట్ల రూపాయలు బూడిదలో పోసిన పన్నీరులా మారింది. డివైడర్లపైన ఏర్పాటుచేసిన చెట్లన్నీ పూర్తిగా ఎండిపోతున్నాయి. ముద్దనూరు రోడ్డులో ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద చెట్లకు నీళ్లుపోసే నాథుడే లేడు. పచ్చగా కళకళలాడాల్సిన చెట్లు పూర్తిగా ఎండిపోతున్నాయి. ఇదేమని మున్సిపాలిటీని అడిగితే అవి తమకు సంబంధం లేదని చెబుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులూ చేతులెత్తేస్తున్నారు. మున్సిపాలిటీకి దాదాపు రూ.35కోట్ల నుంచి రూ.40కోట్ల మేర విద్యుత్ బకాయిలు ఉన్నాయి. ఈ కారణంగానే వీధిలైట్లను పూర్తిస్థాయిలో వెలిగించలేదని ఓ అధికారి సెలవిచ్చారు. కానీ డివైడర్లపైన ఉన్న గ్రీనరీకి కాసిన్ని నీళ్లు పోస్తే సరిపోతుంది కదా అనే ప్రశ్నకు ఇద్దరి దగ్గర సమాధానం లేదు.



అలవలపాడు రహదారి కూడలిలో వెలగని హైమాస్ట్ లైట్లు



రూ.2.70కోట్లు ఖర్చు చేసినా వెలగని వీధి దీపాలు



శిల్పారామం సమీపంలో పూర్తిగా ఎండిపోయిన మొక్కలు

పన్ను చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లు

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలో ఇంటి పన్ను, కొళాయి పన్ను చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసినట్లు కమిషనర్ మనోజ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక సంవత్సరం చివరి నెల కావడంతో సెలవు దినాల్లో కూడా కార్పొరేషన్ కార్యాలయంలో పన్నులు చెల్లించేందుకు కౌంటర్ ఉంటుందని చెప్పారు.

రేపు స్పర్శ్ ఔట్‌రీచ్ కార్యక్రమం

కడప(వినాయకనగర్), మార్చి15 (ఆంధ్రజ్యోతి): జిల్లా సైనిక సంక్షేమ భవనంలో ఈ నెల 17న స్పర్శ్ ఔట్‌రీచ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ సైనిక్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పిలిప్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో స్పర్శ్ ఈసీహెచ్ఎస్ కేఎఫ్‌సీ డిజబిలిటీ పెన్షన్ తదితర సేవలు ఉంటాయన్నారు. ఈసీహెచ్ఎస్ సేవా కేంద్రాలు ఉచితంగా సేవలు అందిస్తాయన్నారు.పీపీవో, ఆధార్, పాన్‌కార్డులు, బ్యాంక్‌పాసుబుక్కుతో హాజరుకావాలన్నారు.

నీటి సమస్యను తీర్చండి

కడప నాగరాజుపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా తాగు నీరు రావడం లేదు, దీనితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని 27వ డివిజన్ గౌస్‌నగర్ వాసులు అన్నారు. శనివారం 27వ డివిజన్‌లో ప్రజలతో కలిసి ముస్లిం మైనార్టీ నాయకులు లయన్ పటాన్ ఖాదర్‌బాష, అమానుల్లాలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ మంచినీరు రాక నానా అవస్థలు పడుతున్నామన్నారు. ట్యాంకర్ కూడా అందుబాటులో లేదన్నారు. రంజాన్ మాసంలో కూడా మంచినీరు అందించకపోవడం అసంతృప్తి వ్యక్తం చేశారు.

అక్రమ కట్టడాలను తొలగించాలి

కడప కలెక్టరేట్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని గోపవరం మండలం మడకల వారిలో పల్లెలో సర్వేనెంబరు 977/3లో 2.34 ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలను తొలగించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరికు జిల్లా భూ పోరాట సాధన కమిటీ నేతలు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో భూపోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనరు బి.నారాయణ, కన్వీనరు సి.ఆర్.వి.ప్రసాద్, కోశాధికారి ఆంజనేయులు, బీఎస్పీ నేత సగిలి గుర్రప్ప, దేవర శ్రీకృష్ణ తదితరులు ఉన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలి

కడప మారుతీనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకంలో 17 సంవత్సరాల కాలం పాటు ఫీల్డ్ సిబ్బందిగా పనిచేస్తున్న తమ సేవలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వ పరిధిలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్ట్-ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జాయింట్ సెక్రటరీ సుబ్బరాజు డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా రాష్ట్ర యూనియన్ పిలుపుమేరకు దశలవారిగా శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా ఈనెల 17వ తేదీన, అలాగే 24వ తేదీన పాత కలెక్టరేట్‌లో గల జిల్లా సమన్వయకర్త కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. అనంతరం ఈనెల 27న గుంటూరు జిల్లా మంగళగిరి లోని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కార్యాలయంలో శాంతియుతంగా నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు.

అవినీతి అక్రమాలపై విచారణ జరపాలి

కడప నాగరాజుపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ బి.సాంబశివారెడ్డి రూ.6కోట్ల స్కామ్‌పై తక్షణం విచారణ జరపాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరం (ఆర్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసుయాదవ్ డిమాండ్ చేశారు. కడప కలెక్టర్ సబాభవనం వద్ద ఆర్‌జేడీ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కె.శామ్యూల్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నవీన్, నాయకులు నాగమల్లయ్య, అశోక్, సూర్య వంశీ, నాగార్జున, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షిలో అతి తక్కువ ధరలతో విక్రయాలు

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని లేపాక్షి ఎంపోరియంలో ఈ నెలాఖరు వరకు యాన్యువల్ క్లియరెన్స్ సేల్స్ (తగ్గింపు ధరలతో ప్రదర్శన విక్రయాలు) ఉంటాయని కడప లేపాక్షి ఎంపోరియం ఇన్‌చార్జి మేనేజర్ ఎస్వీ నరేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ప్రజలలోకి తమ ఉత్పత్తులను మరింత చేరువగా తీసుకెళ్లడంతో పాటు రానున్న ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకొని ఈ అమ్మకాలు చేపట్టినట్లు తెలిపారు. హస్త కళా ఉత్పత్తులు, చేనేత వస్త్రాలపై పది శాతం, ఎంపిక చేసిన కొన్ని వస్తువులపై 20 నుంచి 50శాతం వరకు తగ్గింపు ఉంటుందన్నారు. కోటిరెడ్డి సర్కిల్ వద్ద ఉన్న లేపాక్షి ఎంపోరియంలో ఉదయం 10 నుంచి రాత్రి 8గంటల వరకు ఈ అమ్మకాలు జరుగుతాయన్నారు.

ప్రతి ఒక్కరూ సాయం అందించాలి

చెన్నూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ మానవతా సంస్థ ద్వారా పేదల కోసం సహాయ సహకారాలు అందించాలని టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. చెన్నూరుకు చెందిన ముసలయ్యగారి ఓబుల్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆమె కుమార్తెలు ఓబులమ్మ, సౌజన్య అదే విధంగా చెన్నూరుకు చెందిన రెడ్డి రమణమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారులు సుబ్బరాయుడు, శ్రీనివాసులు, చిన్న మానవతా సేవా సంస్థకు చెరోకటి వంతున రెండు బాడీఫ్రీజర్లు మానవతా సంస్థ సభ్యులైన ఆటోబాబుకు శనివారం అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాలకొండారెడ్డి, ఆవుల బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాడీఫ్రీజరును అందిస్తున్న దృశ్యం

తూతూ మంత్రంగా సామాజిక తనిఖీ

వేముల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వేములలో శనివారం చేపట్టిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభ తూతూమంత్రంగా నిర్వహించారు. ఉదయం 10గంటలకు ప్రారంభం కావాల్సిన సభ అధికారుల నిర్లక్ష్యం వలన మధ్యాహ్నం 2.40గంటలకు ప్రారంభమైంది. అప్పటికే ప్రజలు, ప్రజాప్రతినిధులు వెనుదిరిగి వెళ్లిపోయారు. పీడీ ఆదిశేషారెడ్డి సభను ప్రారంభించి కార్యక్రమాన్ని నిర్వహించారు. సామాజిక తనిఖీలో బయటపడిన పలు అంశాలను ఉపాధి సిబ్బందిని ప్రశ్నించగా సమాధానాలు చెప్పలేక సతమతమయ్యారు. వీరిపై పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి రికార్డులు తీసుకురాకుండా హాజరవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్లాస్టిక్ వద్దు... జ్యూట్‌బ్యాగు ముద్దు

వేముల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగం వద్దుజ్యూట్ బ్యాగులు ముద్దు అంటూ వేములలో నినదించారు. శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర దివస్ కార్యక్రమంలో భాగంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధి రెడ్డి, తహసీల్దార్ ఇందిరారాణి, వెలుగు ఏపీఎం అంజనేయులు ఆధ్వర్యంలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీపద్మావతి, సీసీలు జ్యోతి, జైపాల్, హరికృష్ణ పాల్గొన్నారు.



రోడ్లను శుభ్రం చేస్తున్న పార్థసారధిరెడ్డి

రూ.514.31కోట్లతో కార్పొరేషన్ అంచనా బడ్జెట్



స్టాండింగ్ కమిటీ బడ్జెట్ సమావేశంలో మేయర్, కమిషనర్, సభ్యులు

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కడప నగరపాలక సంస్థ 2025-26వ సంవత్సరానికి సంబంధించిన రూ.514.31కోట్లతో అంచనా బడ్జెట్‌ను స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. శనవారం మేయర్ చాంబర్‌లో మేయర్ సురేష్‌బాబు అధ్యక్షతన బడ్జెట్‌పై స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహంచారు. వివిధ పద్దుల సవరణలతో అంచనాల బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. కమిషనర్ మనోజ్‌రెడ్డి హాజరయ్యారు. మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ బడ్జెట్‌లో అభివృద్ధి పనులకు కేటాయించబడిన మొత్తంలో ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, వికలాంగులు, స్త్రీ శిశు సంక్షేమం కోసం కేటాయంచబడిన మొత్తాలు వారి సంక్షేమ పనుల కోసం ఖర్చు చేయాలని నిర్ణయంచినట్లుచెప్పారు. నికర నిధులలో ఖర్చు 40శాతం నిధులను మురికివాడలలో అభివృద్ధి పనులకు వెచ్చించవలసిందిగా ఇంజనీరింగ్ శాఖకు సూచించామని తెలిపారు. సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు వాణి, మక్బూల్ బాష, బాలస్వామిరెడ్డి, బాబు, నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, ఎగ్జామినేషన్ ఆఫ్ అకౌంట్స్ ఆఫీసర్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాయచోటి ఘటనలో దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



కడప సెవెన్ రోడ్స్ మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మతసామరస్యం-ప్రాధాన్యం అనే అంశంపై శనివారం నూర్జహాన్ కళ్యాణమండపంలో రౌండ్ టేబుల్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు ఇందులో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఐక్యతకు నిలయమైన రాయలసీమ ప్రాంతంలో మతచిచ్చులు చెలరేగుతున్నాయన్నారు. రాయచోటి ఘటనలో పోలీసులు అరెస్టు చేసిన వారిలో వయసు మళ్లిన, అనారోగ్యంతో ఉన్న వారు, పిల్లలు జైల్లో ఉంచారన్నారు. బీజేపీ చేస్తున్న పనులకు సర్వమతాల ప్రజలు విసిగి వేసారి పోతున్నారన్నారు. కాగా 25వతేదీ లోపు రాయచోటి, చెన్నూరు సంఘటన వ్యతిరేకిస్తూ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ రవిశంకర్‌రెడ్డి, టీడీపీ అధికార ప్రతినిధి జిలాన్, అమీర్‌బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అఫ్జల్‌ఖాన్, గౌస్‌పీర్, సీఎస్ఐ టౌన్‌చర్చి పాస్టర్ మోహన్‌బాబు, ఇండిపెండెంట్ పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెం భాస్కర్, సీపీఐ లిబరేషన్ ఓబయ్య, ఎస్ఆర్‌సీ, సీఏఏ కన్వీనర్ బాబాయ్, సీహెచ్ శివారెడ్డి, జాకీర్, సంఘ సేవకుడు సలావుద్దీన్, రాయలసీమ మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి తస్లీమా, కాంగ్రెస్ పార్టీ గౌస్‌పీర్, ఎస్‌టీఐ తాహిర్, వైసీపీ షఫి తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి: సీఐ



మాట్లాడుతున్న సీఐ రామక్రిష్ణ

కడప క్రైం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కడప వన్‌టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు బి.రామక్రిష్ణ సూచించారు. శనివారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పిల్లలు బాగా చదివితే అనుకున్న లక్ష్యాన్ని చేరుతా రన్నారు. చెడు తిరుగుళ్లు, చెడు స్నేహాల వల్ల జీవితాలు నాశనమ వుతాయన్నారు. కార్యక్రమంలోప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించవద్దు..: మత్తు కలిగే మందుల కోసం మెడికల్ షాపులకు వచ్చే వారికి ఎట్టి పరిస్థితుల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించవద్దని వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ మెడికల్‌షాపు నిర్వాహకులకు సూచించారు. శనివారం కడప డీఎస్పీ కార్యాలయంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈగల్ ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పార్థసారథిని సస్పెండ్ చేయాలి : కాంగ్రెస్

కడప కలెక్టరేట్, మార్చి15(ఆంధ్రజ్యోతి): శాసన సభలో ఇటీవల ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రసంగం చేయడం అన్యాయమని, వెంటనే ఆయనను సస్పెండ్ చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్‌అలీఖాన్, మాజీ కార్పొరేటర్ రంతుల్లాఖాన్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సమావేశంలో ఆయన స్పీకర్‌కు పిర్యాదు చేసిన లేఖను విడుదల చేశారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కుళ్లాయప్ప, నేతలు సంజయ్‌కాంత, హమీద్ ,గంగయ్యగౌరీ పాల్గొన్నారు.

మాజీ డిప్యూటీ సీఎం వ్యాఖ్యలు అర్థరహితం

● టీడీపీ 24వ డివిజను ఇన్‌చార్జి అశోక్‌రెడ్డి

కడప మారుతీనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తనపై చేసిన ఆరోపణలు అర్థరహితమని 24వ డివిజను టీడీపీ ఇన్‌చార్జి అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం రాజారెడ్డివీధిలో ఉన్న టీడీపీ డివిజను కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో జిల్లాతో పాటు కడప నగరం యథేచ్ఛగా గంజాయి, జూదం, తదితర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. గతంలో అంజద్‌బాషా సోదరుడు అహ్మద్‌బాషా సారధ్యంలో జరిగిన అసాంఘిక వ్యవహారాలు అన్నీ ఇన్నీ కావన్నారు. అప్పట్లో అహ్మద్‌బాషా చేసిన అసాంఘిక కార్యకలాపాలపై ఏనాడు నోరు మెదపని అంజద్‌బాషా ఇవాళ తనపై దుష్ప్రచారం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇదిలా ఉండగా నగరంలోని రాజారెడ్డివీధికి చెందిన వైసీపీ నాయకుడుగా చెలామణి అయ్యే వ్యక్తి గత వైసీపీ పాలనలో సాగించిన పలు దందాలను ఆధారాలతో త్వరలో బయటపెడతానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు బొమ్మిశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కేసులు పెట్టి వేధించడం దారుణం

బీసీవైపీ రామచంద్రయాదవ్



మాట్లాడుతున్న రామచంద్రయాదవ్

కడప క్రైం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : రెండు వర్గాల మధ్య సమస్యలు ఉన్నప్పుడు శాంతియుతంగానే సమస్యను పరిష్కరించాల్సింది పోయి కేవలం ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని విపరీతమైన సెక్షన్లతో కేసులు పెట్టి వేధించడం అనేది చాలా దారుణమని ఇది సరైనది కాదని భారత చైతన్య యువజన పార్టీఅధ్యక్షుడు రామచంద్రయాదవ్ అన్నారు. ఇటీవల రాయచోటిలో జరిగిన సంఘటనకు సంబంధించి అక్రమ కేసుల ద్వారా రిమాండ్‌లో ఉన్న బాధితులను శనివారం ఆయన కడప కేంద్ర కారాగారానికి వచ్చి పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎక్కడైనా రెండు వర్గాల మధ్య సమస్య ఉంటే వాటిని పోలీసులు దృష్టి సారించి శాంతియుతంగా పరిష్కరించాలని అయితే కేవలం ఒక వర్గాన్ని టార్గెట్ చేసుకుని కేసులు నమోదు చేయడం బాధాకరమైన అంశమని అన్నారు. ఎంతోమంది అమాయకులను కేసులు పెట్టి హింసలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో భారత చైతన్య యువజన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీకలు ఉత్సవాలు

● ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

పెండ్లిమర్రి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కుల మతాలకు అతీతంగా,మతసామరస్యానికి ప్రతీకగా నారాయణస్వామి ఆరాధన, హజరత్ హుస్సేన్ వలి ఉరుసు ఉత్సవాలను ఒకే రోజు జరుపుకోవడం ఈ గ్రామాల ప్రజల ప్రత్యేకత అని ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి తెలిపారు. మొయిల్లకాల్వ గ్రామంలో శనివారం ఉరుసు ఉత్సవాలకు ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బండలాగుడు పోటీలను ప్రారంభిచారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నేతలు పుత్తా సాయి నరసింహారెడ్డి,సారధి రెడ్డి,శ్రీనివాసుల రెడ్డి,రాజశేఖర్, వెంకటసుబ్బయ్యనారాయణరెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే ప్లాస్టిక్ సంపూర్ణ నిషేధం

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే ప్లాస్టిక్‌ను సంపూర్ణంగా నిషేధించగలమని కమిషనర్ మనోజ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కడప నగరం కార్పొరేషన్ కార్యాలయం నుంచి స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. కోటిరెడ్డి సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను ప్రజలందరూ కూడా నిర్మూలించేందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రతినిధులు, ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధులు, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కమలాపురం రూరల్..: ప్లాస్టిక్ నిర్మూలిద్దాం... పర్యావరణం కాపాడుకుందామని ఎమ్మెల్యే క్రిష్ణచైతన్య రెడ్డి అన్నారు. శనివారం పంచాయతీలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ పగడాల జగన్నాథ్, అధికారులు, టీడీపీ ప్రజాప్రతి నిధులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్..: చెత్త నుంచి సంపదను సృష్టించాలని రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డిరాంగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పూలంగళ్ల సెంటరులో చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, బొజ్జ మైనూరారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్..: స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని వైవీయూలో నిర్వహించారు. హ్యూమానిటీస్, గురుకులం, ప్రిన్సిపాల్ కార్యాలయ ప్రాంగణం, సైన్స్ బ్లాక్‌లలో విద్యార్థులు వ్యర్థాలను తొలగించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధాన ఆచార్యులు ప్రొఫెసర్ ఎస్.రఘు నాథరెడ్డి డీన్‌లు, స్వచ్ఛ ఆంధ్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె.లలి, డాక్టర్ వెంకటరామిరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓలు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కడపలో ర్యాలీ ప్రారంభిస్తున్న అధికారులు




పులివెందులలో రోడ్లు శుభ్రం చేస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

జ్యోతి క్షేత్రానికి ఇక మంచి రోజులు

- కూల్చిన భవనాల స్థానంలో మంత్రి నారా లోకేశ్ చొరవతో పునర్నిర్మాణాలు
- 5.5 హెక్టార్ల అటవీ స్థలానికి కేంద్రం సూచనప్రాయ అంగీకారం
- భక్తుల్లో చిగురిస్తున్న ఆశలు
- గత 10 సంవత్సరాలుగా నిలిచిపోయిన గుడినిర్మాణ పనులు
- ఆలయ అభివృద్ధికి స్థానిక టీడీపీ నేతల కృషి


ఆశ్రమంలో కూలగొట్టిన స్థానంలో తిరిగి నిర్మిస్తున్న కట్టడాలు


కాశినాయన జ్యోతి క్షేత్రం గోశాల వద్ద ఉన్న గోవులు


పదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న కాశినాయన ఆలయం

కాశినాయన మార్చి15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన జ్యోతీక్షేత్రానికి ఇక మంచి రోజులు రానున్నాయని భక్తుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇటీవల అనుమతి లేవంటూ అటవీ శాఖాధికారులు కొన్ని నిర్మాణాలను కూల్చివేయడం. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి నారాలోకేశ్ స్పందించి కూల్చిన భవనాల చోటనే కొత్త వాటి కోసం పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడంతో భక్తులకు కొంత నమ్మకం ఏర్పడింది. అంతే కాకుండా ప్రభుత్వ పెద్దల సహకారంతో యుద్ధ ప్రాతిపదికన ఎంపీ పురంధేశ్వరి, ఎమ్మెల్యే అదినారాయణరెడ్డి, నాయకులు భూపేష్‌రెడ్డి ఇతర నాయకులతోపాటు స్థానిక నేత రితేష్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి కేంద్ర అటవీ శాఖమంత్రి భూపేష్‌యాదవ్‌ను కలిసి సమస్యను వివరించారు. ఇందుకు స్పందించిన కేంద్ర అటవీశాఖ మంత్రి మొదటి విడతగా దాదాపు 5.5 హెక్టార్లు అటవీభూమిని కాశినాయన ఆశ్రమానికి ఇచ్చేవిధంగా సూచనప్రాయంగా అంగీకరించారని స్థానిక టీడీపీ నాయకత్వం తీపికబురు అందించింది. దీంతో కాశినాయన భక్తులు, టీడీపీ నాయకులు కూటమి నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. కాశినాయన మండలం వరికుంట్ల సమీపంలోని నల్లమల అడవుల్లో వెలసిన ఆధ్యాత్మిక క్షేత్రమే జ్యోతి. ఇక్కడ లక్ష్మీనరసింహస్వామి, అన్నపూర్ణాదేవి, కాశిరెడ్డినాయన గుడి నిత్యాన్నదాన ఆశ్రమం, రామాలయం, గోమాత సమాధి, దత్తాత్రేయ స్వామి కోవెలలు ఉన్నాయి.ప్రతి సంవత్సరం దత్తజయంతి రోజున రెండు రోజుల పాటు కాశినాయన ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ వేడుకలకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు వచ్చి కాశినాయనను దర్శించుకొని తమకు తోచిన ధనమో, ధాన్యమో, వస్తురూపేణ సాయమందించి మొక్కులు తీర్చుకుంటారు.

ఆగిన నిర్మాణాలు: దాదాపు 30 సంవత్సరాలుగా ఆధ్యాత్మిక కేంద్రంగా ఓ వెలుగు వెలిగిన కాశినాయన ఆశ్రమానికి(జ్యోతి క్షేత్రానికి)అడుగడుగునా అధికారుల నుంచి అవరోధాలు ఎదురవుతూ వచ్చాయి. కేంద్ర అటవీ పరిధిలో ఉన్న కాశినాయన ఆశ్రమానికి ఫారెస్ట్ అనుమతులు లేవంటూ ఇది టైగర్ జోన్‌లో ఉందని ఫారెస్ట్ అధికారులు అడ్డుపడ్డారు. దీంతో గత 10 సంవత్సరాలుగా కాశినాయన గుడినిర్మాణం అర్థాంతరంగా ఆగిపోయింది.

కూల్చివేతలపై ఘాటుగా స్పందించిన కూటమి నేతలు: కేంద్ర అటవీ శాఖ ఆదేశాలను అమలు పరచే విషయంలో మార్చి 7న పోలీసు రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు నిర్మాణా లను కూల్చివేశారు. విషయం తెలుసుకున్న బద్వేల్ టీడీపీ సమన్వయకర్త కే.రితేష్‌రెడ్డి మంత్రి నారాలోకేశ్ దృష్టికి తీసుకుపోవడంతో ఆయన ఘాటుగా స్పందించి అన్నీ తానై అభివృద్ధిచేస్తానని భరోసా యిచ్చారు. తన ప్రతిని ధిగా ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు ఛైర్మన్ కేకే చౌదరిని దూతగా పంపి 24 గంటలు తిరగక ముందే జ్యోతికి బస్సులను పునరుద్ధరించారు. సొంతఖర్చులతో పడగొట్టిన నిర్మాణాల స్థానంలో కొత్త నిర్మాణాలు చేప ట్టారు. దీంతో ఢీలా పడిన కాశినాయన భక్తులకు కొండంత బలం చేకూ ర్చిందని ఆలయ ప్రధాన పూజారి జీరయ్య స్వామి, ఆలయ నిర్వాహకులు కొనియాడారు. ఈప్రభుత్వ సహకారంతో జ్యోతిక్షేత్రానికి మహర్దశ వస్తుందని భక్తులు గట్టినమ్మకంతో ఉన్నారు.

నరసింహుడికి ప్రత్యేక పూజలు


అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

బద్వేలు రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 18న స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రా న్నిపురస్కరించుకుని ప్రత్యేక అభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. అభిషేకంలో పాల్గొనదలచిన భక్తులు వేకువజామున 5.30గంటతలకు ఆలయం వద్దకు చేరుకోవాలన్నారు. మధ్యాహ్నం నెల్లూరు పట్టణానికి చెందినశ్రీనివాసరావు కుటుంబ సభ్యులు అన్నదానం చేస్తారన్నారు.

గజవాహనంపై శ్రీనివాసుడు

బద్వేలు రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన లక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం గజవాహనంపై స్వామివారు గ్రామ పురవీధుల్లో ఊరేగారు. ఈ కార్యక్రమానికి పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

కోట పోలేరమ్మకు పట్టువస్త్రాలు


అమ్మవారికి పూజా సామగ్రి తీసుకువస్తున్న సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి

పోరుమామిళ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : కోట పోలేరమ్మకు పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మాధవీ క్లాత్ షోరూం యజమాని తులసి సుధాకర్, తులసి నాగేంద్రలు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పూజా కార్యక్రమాల్లో పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్ పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ వారు వారిని సన్మానించారు.

బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

దువ్వూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం క్రిష్ణంపల్లెలో జరిగిన జమాలయ్య ఉరుసులో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పాల్గొని శనివారం బండలాగుడు పోటీలు ప్రారంభించారు. అనంతరం దర్గాలో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయన వెంట మండల నాయకులు పాపినేని రాంబాబు, మదిరేపల్లి సంజీవరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన అంకాలమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు


భక్తులనుఆకట్టుకున్న సిరిమాను

బి.కోడూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మున్నెల్లి గ్రామంలో వెలసిన అంకాలమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. అంకాలమ్మ తల్లి ఉత్సవాలకు నగద బండ్లు, కుంకుమబండ్లు, చెక్క భజన, కోలాటం, తువ్వపల్లె, బోడు గుండుపల్లె, మున్నెల్లి గ్రామాల నుంచి సిరిమాను బండ్లు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం బండ లాగుడు పోటీల్లో ప్రకాశం జిల్లాకు చెందిన ఎడ్లకు మొదటి బహుమతి నంద్యాల జిల్లాకు చెందిన ఎడ్లకు రెండో బహుమతి గెలుచుకున్నారు. ఈ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టిబందోబస్తు నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న రితీష్‌రెడ్డి

బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ రితీష్‌కుమార్‌రెడ్డి శనివారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికి దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు. ఆయన వెంట మండల టీడీపీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి, ఓ.రమణారెడ్డి, గోడి రమణారెడ్డి, ఎల్ఎస్‌పీ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ వెంకటరమణారెడ్డి, వెంకటసు బ్బారెడ్డి, ఉుగ్గిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రాఘవరెడ్డి, పవన్ పాల్గొన్నారు.

జ్యోతిలో కూల్చిన కట్టడాలు పరిశీలించిన విజయజ్యోతి



కాశినాయన మార్చి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని జ్యోతి క్షేత్రంలో ఇటీవల అటవీ శాఖాధికారులు కూల్చివేసిన కట్టడాలను శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయ జ్యోతి పరిశీలించారు. ఇటీవల కాశినాయన ఆశ్రమంలో అనుమతులు లేవంటూ అటవీ అధికారులు కూల్చిన కట్టడాలను ఆమె పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం అయిన జ్యోతిక్షేత్రంలో కాశినాయన ఆశ్రమం ఏర్పడటం మనందరి అదృష్టమని అలాంటి పవిత్రమైన క్షేత్రంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు.జరిగిన సంఘటనలపై ఆలయ నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు డాక్టర్ అన్వర్, ఓబీసీ బద్వేల్ నియోజకవర్గ ఛైర్మన్ గురప్ప, నాయకులు ముజాహిద్, అష్రఫ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మడకలవారిపల్లెలో అక్రమ కట్టడాలను తొలగించాలి

కలెక్టర్‌కు భూ పోరాట సాధన కమిటీ వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న భూపోరాట సమితి నేతలు

కడప కలెక్టరేట్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని గోపవరం మండలం మడకలవారిలోపల్లెలో సర్వేనెంబరు 977/3లో 2.34 ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలను తొలగించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరికి జిల్లా భూ పోరాట సాధన కమిటీ నేతలు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమి హైవేకి సమీపంలో ఉండడంతో మార్కెట్ విలువ దాదాపు రూ. 24 కోట్ల పైగా ఉంటుందన్నారు. ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాల విషయమై ఇప్పటికే మున్సిపల్ కమిషనరు, రెవెన్యూ డివిజనల్ అధికారికి పిర్యాదు చేయడం జరిగిందన్నారు. మున్సిపల్ కమిషనరు విచారణ చేసి సర్వే నెంబరు 977/3లో అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు తేల్చి 30 రోజుల్లో తొలగించాలని చెప్పారన్నారు. రెండున్నర నెలలు కావస్తున్నప్పటికీ అక్రమ కట్టడాలు తొలగించక పోగా హైకోర్టు ఉత్తర్వులు కూడా బేఖాతారు చేశారన్నారు. భూపోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనరు బి.నారాయణ, కన్వీనరు సీఆర్‌వీ ప్రసాద్, కోశాధికారి ఆంజనేయులు, బీఎస్పీ నేత నగిలి గుర్రప్ప, దేవర శ్రీకృష్ణ తదితరులున్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



ఎర్రగుంట్ల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల నగరపంచాయతిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కమిషనర్ పేర్లిశేషపణి, ఎన్‌డీఏ మండల ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి శనివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు. వారి సంక్షేమంపై ప్రత్యేక దృష్టిపెడతామన్నారు.

అర్బన్ కేంద్రానికి దుప్పట్లు పంపిణీ: ఎర్రగుంట్ల నగరపంచాయతిలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఉన్న బెడ్లపై పరచే దుప్పట్లను ఎన్‌డీఏ ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, టీడీపీ నాయకులు, సూపర్‌వైజర్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

మహిళకు రక్తదానం చేసిన ఎంపీటీసీ

పోరుమామిళ్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఓఎల్ఎఫ్ ఆసుపత్రిలో ఓ మహిళకు బి.పాజిటివ్ రక్తం అవసరం కావడంతో విషయం తెలుసుకున్న ఎంపీటీసీ రమణ ఆమెకు రక్తదానం చేశారు. దీంతో ఎంపీటీసీని స్థానికులు, ఆసుపత్రి సిబ్బంది అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతుకు తీవ్రగాయాలు

జమ్మలమడుగు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు-తాడిపత్రి రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ రైతు గాయపడ్డాడు. పొలం నుంచి ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతున్న రైతు వెంకటసుబ్బారెడ్డిని వెనుకవైపు నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన రైతును జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో ప్రొద్దుటూరకు తరలించారు.

బీసీల రుణాల కోసం యూనిట్లు పెంచాలి

ప్రొద్దుటూరు , మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు రుణ యూనిట్లు పెంచాలని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ముని సాయి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరుల తో మాట్లాడుతూ ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో అత్యధికంగా బీసీ జనాభా ఉన్నారని కేవలం 124 యూనిట్లు ఇచ్చి ఇక్కడ బీసీలను ప్రభుత్వం దగా చేస్తున్నదని ఆరోపించారు. ఆ మేరకు మున్సిపల్ కార్యాలయంకు వెళ్లి మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను కలిసి బీసీ నిరుద్యోగు సంఖ్యను దృష్టిలో పెట్టుకోని రెండు వేల యూనిట్లు మంజూరు చేయాలని కోరారు. ఆమేరకు కమిషనర్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం బీసీ నిరుద్యోగ యువకులకు న్యాయం చేయకపోతే ప్రభుత్వాన్ని ప్రజల్లో ఎండగడతామని హెచ్చరించారు. కమిషనర్ ను కలిసిన వారిలో ఓబీసీ విద్యార్థి సంఘం పట్టణ అధ్యక్షుడు నరేష్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని పూర్తిగా తరిమివేద్దాం : డీపీవో


ప్లాస్టిక్ రహిత సంచులను ప్రదర్శిస్తున్న డీపీవో , డీఎల్‌పీవో తదితరులు


కూరగాయల మార్కెట్‌లో వ్యర్థాలను తొలగిస్తున్న కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు/ రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): భూసారానికి జీవం పోయడంతోపాటు మూగజీవాల పాలిట మృత్యువుగా మారుతున్న ప్లాస్టిక్ భూతాన్ని తరిమివేసేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. ఆహారంతోపాటు ప్లాస్టిక్‌ను తీసుకున్న మూగజీవాలు మృత్యువాత పడటానికి పరోక్షంగా మనమే కారణం అవుతున్నామన్నారు. భావితరాలకు సారవంతమైన భూమిని అందించాలంటే ప్లాస్టిక్‌ను నిషేధించాలని కోరారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పునఃప్రారంబించి సేంద్రియ ఎరువుల తయారీకి సూచనలు జారీ చేశారు. తదనంతరం ప్లాస్టిక్ రహిత సంచులను ప్రోత్సహిస్తూ ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, గ్రీన్ అంబాసిడర్స్, అంగన్వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలతో పెద్ద ఎత్తున కొత్తపల్లె పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి అక్కడ మానవ హారంగా ఏర్పడ్డారు. స్వచ్ఛాంధ్రపై ప్రతిజ్ఞ, నినాదాలు చేశారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో తిమ్మక్క, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, ఈవోపీఆర్‌డీ రామాంజనేయులరెడ్డి, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు. ప్రొద్దుటూరు పట్టణాన్ని స్వచ్ఛతగా ఉంచుకోవడం పట్టణంలో నివసించే ప్రతి పౌరుడి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ వి మల్లికార్జున తెలిపారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంను స్థానిక మున్సిపల్ తాత్కాలిక కూరగాయ మార్కెట్‌లోఉన్న అంతర్గత రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు నూర్‌బాషా, సుబ్బరాయుడు, సునీతలతో పాటు సచివాలయ శానిటరీ సెక్రటరీలు పారిశుధ్య కార్మికులు మేస్త్రీలు మార్కెట్ వ్యాపారులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడమే లక్ష్యం


పరిసరాలను శుభ్రం చేస్తున్న కమిషనర్, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త

బద్వేలు టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను నిషేధించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్ రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్ర మంలో భాగంగా 6వ వార్డు పూల బావివీధిలో వార్డుల్లో పర్యటించి వీధులను శుభ్రం చేశారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాన్ని సాధించాలంటే ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. 6 వవార్డు కౌన్సిలర్ సోమేసుల సుధామణి , డాక్టర్‌క్రాంతి కుమార్, బద్వేలు పట్టణ అధ్యక్షుడు వెంగళరెడ్డి, రాగిమాను ప్రతాప్‌కుమార్, మిత్తికాయల రమణయాదవ్, ఆనంద్, నాగభూషణం, నరసింహనాయుడు, సింగసాని విజయ్, సుబ్బారెడ్డి, సింగరయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు ప్రజలు సహకరించాలి


జమ్మలమడుగులో ర్యాలీ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

జమ్మలమడుగు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నగర పంచాయతీ స్వచ్ఛతకు ప్రజలు సహకరించాలని అధికారులు పిలుపునిచ్చారు. నగర పంచాయతీ పరిధిలోని పురవీధుల్లో శనివారం అర్బన్ పోలీసు స్టేషన్ వద్ద నుంచి కమిషనర్ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉద్యోగులు భారీ ర్యాలీ చేశారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛత పాటించాలని, స్వచ్ఛతతో ఆరోగ్యమని అన్నారు. అర్బన్ సీఐ లింగప్ప పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా అధికారులు, ఆర్పీలు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం


పోరుమామిళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్

పోరుమామిళ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి):పోరుమామిళ్లలో ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్ పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పోరుమామళ్ల పంచాయతీలో ర్యాలీ నిర్వహించి దుకాణాల వద్ద వ్యాపారస్తుల వంద్ద ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యనిర్వహణాధికారి రవిశంకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సుదర్శనరెడ్డి, నరసింహులు, దర్వేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. కాగా ప్లాస్టిక్‌ను బహిష్కరిద్దాం.. సమాజాన్నికాపాడుదామని ఎంపీడీవో రమణారెడ్డి పేర్కొన్నారు. రంగసముద్రం పంచాయతీ గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులను బహిష్కరించి వస్త్ర సంచులు వినియోగించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సీఎంబాషా, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణాంధ్రపై భారీ ర్యాలీలు

కొండాపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కొండాపురం రామసుబ్బారెడ్డి నగర్‌లో స్వచ్ఛ దివస్ ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం.. పరిసరాలను శుభ్రంగా ఉంచుదాం వంటి నినాదాలతో విద్యార్థులు, ప్రభుత్వ ఆసుపత్రి, అంగనవాడీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ పరిధిలోని పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి, అంగన్‌వాడీ సిబ్బంది భారతి, ధనలక్ష్మి, కళావతి, మౌనిక, జ్యోతి, రామతులసి పాల్గొన్నారు.

రాజుపాలెంలో:మండలంలోని టంగుటూరు గ్రామంలో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని ఎంపీడీవో షాకిర్‌ఆలీఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో చెత్త చెదారం ఎక్కడంటే అక్కడ వేయకుండా పారిశుధ్యం పాటించడంతో పాటు ఎస్టీ కాలనీ తదితర కాలనీల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు.

మైలవరంలో: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని దొమ్మరనంద్యాల గ్రామంలో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు, సంచులు వాడటం వలన రాబోవు కాలంలో పర్యావరణంకు పెనుముప్పు పొంచి ఉందనిప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామమోహన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

చాపాడులో: మండల కేంద్రమైన చాపాడులో శనివారం స్వచ్ఛాంధ్రపై అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎంఈవోలు రవిశంకర్, వంశీకృష్ణ, హెడ్మాస్టర్ మహ్మద్‌గౌస్, ఈవోపీఆర్‌డీ క్రిష్ణవేణి, గ్రామ కార్యదర్శులు, విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. గ్రామాలు శుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యవంతంగా జీవించవచ్చన్నారు. లక్ష్మిపేట గ్రామంలో జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఎంపీ శ్రీనివాసులరెడ్డి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

బ్రహ్మంగారిమఠంలో : ప్లాస్టిక్ వాడకాన్ని వెంటనే నిర్మూలించాలని ఎంపీడీవో వెంగమునిరెడ్డి తెలిపారు. శనివారం బి.మఠం మండలంలోని నరసన్నపల్లె గ్రామంలో గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలను పరిశుభ్రం చేశారు. అలాగే ఎంపీడీవో కార్యాలయం నుంచి అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు వెలుగు సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈవోపీఆర్‌డీ సురేశ్, వెలుగు ఏపీఎం శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

దువ్వూరులో: ప్లాస్టిక్‌తో తయారు చేసిన పరికరాల వాడకానికి స్వస్తి పకాలని ఎంపీడీవో రామకృష్ణయ్య సూచించారు. దువ్వూరు మండలం చింతకుంట గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవోపీఆర్‌డీ హరికృష్ణ, పంచాయతీరాజ్ ఏఈ సుబ్రమణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏడీ శివకుమార్ పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో: స్వచ్ఛదివస్‌లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని ఎంపీడీవో వెంకటరమణయ్య పేర్కొన్నారు. శనివారం పోట్లదుర్తిలో స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా వీధులను ఊడ్పించారు. అలాగే విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎర్రగుంట్ల నగర పంచాయతిలో శనివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు వీధులను శుభ్రం చేశారు. 9సచివాలయాల్లో ఈకార్యక్రమాన్ని నిర్వహించి స్వచ్ఛ దివస్‌ను పాటించారు. ఈకార్యక్రమంలో కమిషనర్ పేర్లిశేషపణి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఆర్థికసాయం

రాజుపాలెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం కింద రాష్ట్రంలో అసంపూర్తిగా నిలిచిన గృహ నిర్మాణాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని ఎంపీడీవో రమణారెడ్డి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిందన్నారు. అందులో భాగంగా ఎస్సీలకు రూ.50వేలు, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేల చొప్పున అందనుందన్నారు. ప్రజలు అదనపు ఆర్థిక సాయం కోసం గ్రామ సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంటు, ఏఈ హౌసింగ్ వారిని సంప్రదించాలని తెలిపారు.

భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

బద్వేలు టౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి):భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సునిత, బొమ్మన ఫౌండేషన్ డైరెక్టర్ విజయ్, డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బొమ్మన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, యర్రంరెడ్డి, శేఖర్ రాయల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనే ప్రధాన లక్ష్యం

గోపవరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిర్మూలనే స్వచ్ఛ ఆంధ్ర ప్రధాన లక్ష్యమన ఈవోపీఆర్‌డీ షేక్ హసీనా అన్నారు. మండల పరిధిలోని బేతాయపల్లెలో శనివారం పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.